

ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: పీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతంపేట: మండలంలో నెట్ సౌకర్యం లేని పోలింగ్ కేంద్రాలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఐటీడీఏ పీవో కల్పనాకుమారి స్పందించారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలో నెట్‌వర్క్ సదుపాయం లేని 44 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సమాచారం కోసం విలేజ్ రెవెన్యూ సహాయకులు లేదా ఇతర ప్రభుత్వ ఉద్యోగిని నెట్‌వర్క్ సదుపాయం ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గిరిశిఖర గ్రామాల్లో ఓటర్ల కోసం ఘాట్‌రోడ్డు ద్వారా పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేయనున్నామని స్పష్టం చేశారు.

కురిసింది వాన

- కొన్నిచోట్ల భారీగా.. మరికొన్నిచోట్ల మోస్తరుగా..
- ఈదురుగాలుల బీభత్సం
- జిల్లాపై అల్పపీడన ద్రోణి ప్రభావం
- జీడి, మామిడి, అరటి పంటలకు నష్టం
- చల్లబడిన వాతావరణం.. ఉపశమనం పొందిన జిల్లా వాసులు



పాలకొండ వడమ జంక్షన్ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి)/ పాలకొండ/ సీతంపేట/ గరుగుబిల్లి/ భామిని: అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. తెల్లవారుజాము నుంచే కొన్ని చోట్ల విస్తారంగా, మరికొన్ని చోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. జిల్లాలోని మక్కువ మినహా మిగిలిన మండలాల్లో ఒక మోస్తరు వర్షం పడింది. పాలకొండ మండలంలో అత్యధికంగా, గుమ్మలక్ష్మీపురం మండలంలో అత్యల్పంగా వర్షపాతం నమోదైంది. పాలకొండ పట్టణంలో కురిసిన భారీ వర్షానికి కాలువల్లోని మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. ముఖ్యంగా వడమ జంక్షన్, కాంప్లెక్స్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారిపై మురుగు, వర్షపునీరు ప్రవహించడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించలేకపోయారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు తడుస్తూనే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పరీక్ష కేంద్రాలకు ఎలా చేరుకోవాలోనని టెన్షన్ పడుతున్నారు. మరోవైపు వరి, నువ్వులు తదితర అపరాల పంటలకు ఈ వర్షం దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న, నువ్వులు, రాగులు, కోత పూర్తయ్యాయి. అయితే రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టిన పంట కొంతమేర తడిచిపోతుండడంతో ప్రత్యామ్నాయ మార్గాల వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. ఇదే విధంగా వర్షాలు కొనసాగితే మండలంలో సుమారు 600 ఎకరాల్లో కట్టిజనుము రంగుమారి మొలకెత్తే అవకాశముందని మరికొందరు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఈదురుగాలుల కారణంగా ఎక్కడికక్కడ అరటి చెట్లు నేలకొరిగాయి. నష్టాలను అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరారు. ఇక గరుగుబిల్లి మండలంలో ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో గొట్టివలస, తదితర గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపడి చెట్లపై పడ్డాయి. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈదురుగాలుల కారణంగా భామినిలో ఓ ఇంటి పెరట్లో ఉన్న కొబ్బరి చెట్టు మరో ఇంటి పెరట్లో కూలింది. ఒక్కసారిగా శబ్దం రావడంతో ఆ ప్రాంత వాసులు భయాందోళన చెందారు. అయితే ఎటువంటి ప్రమాదం జరగలేదు. లోహరజోలలో అరటి పంట నేలవాలింది. మంగళవారం రాత్రి నుంచి చిరుజల్లులు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరిగింది. భారీ వర్షం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని, ఈ ఏడాది నష్టం తప్పేలా లేదని సీతంపేట మండలంలో జీడి, కొండచీపుర్లు సాగు చేసే రైతులకు వాపోయారు. కాగా కొద్దిరోజులుగా ఎండ వేడికి అల్లాడిపోయిన జిల్లావాసులు ఈ వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.



భామినిలోని ఓ ఇంటి ప్రాంగణంలో కూలిన కొబ్బరి చెట్టు



లోహరజోలలో నేలవాలిన అరటి పంట

డ్యాన్సర్ అవుతాడనుకుంటే..

- విగతజీవిగా మారిన గిరిజన యువకుడు
- ప్రేమ విషయంలో వివాదం.. పురుగుల మందు తాగి ఆత్మహత్య

సాలూరు రూరల్, మార్చి 20: ప్రేమ విషయంలో వివాదం తలెత్తడంతో మనస్తాపం చెంది ఓ గిరిజన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మంచి డ్యాన్సర్ అవుతాడనుకున్న తనయుడు ఇలా విగతజీవిగా మారడంతో తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు మండలం మరిపిల్లికి చెందిన జన్ని రమేష్ (21) మరో గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. అయితే దీనిపై కొద్దిరోజులుగా వివాదం నడుస్తోంది. తన కుటుంబానికి ఇది ఆందోళన కలిగించే అంశంగా రమేష్ భావించాడు. తన వల్ల కుటుంబానికి ఎటువంటి ఇబ్బందులు రాకూడదని భావించాడు. చివరకు జీవితంపై విరక్తితో మంగళవారం మధ్యాహ్నం పొలంలో పురుగుల మందు తాగాడు. అయితే అంతకముందే తన సోదరుడు గణేష్‌కు ఫోన్ చేసి ఈ విషయం చెప్పాడు. దీంతో గణేష్ తన మిత్రులతో కలసి పొలానికి వెళ్లాడు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న రమేష్‌ను హుటాహుటిన మామిడిపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆ తర్వాత సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం రమేష్ మరణించాడు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సాలూరు రూరల్ ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.



రమేష్ (ఫైల్)

విషాదంలో కుటుంబ సభ్యులు

వాస్తవంగా రమేష్ తండ్రి పోలీస్ 15 ఏళ్ల కిందటే మరణించాడు. అప్పటి నుంచి కాయకష్టం చేసి తల్లి జ్యోతి తన ఇద్దరు పిల్లలను పెంచి పెద్ద చేసింది. చిన్నకొడుకు రమేష్‌కు డ్యాన్స్ అంటే ఇష్టం ఉండడంతో ఆ దిశగా ఆమె ప్రోత్సహించింది. కాగా రమేష్ మంగళవారం గ్రామంలో అందర్నీ పలకరించి సాలూరు వెళ్లాడు. అక్కడ పరిచయస్తులతో సరదాగా మాట్లాడి నవ్వించాడు. డాన్స్ స్కూల్‌లో ఉన్న తన బ్యాగ్‌ను తీసుకొని తిరిగి గ్రామానికి వచ్చాడు. అనంతరం పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకోవడాన్ని తల్లి, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. 'రమేష్ మంచి డ్యాన్సర్.. సాలూరులో ప్రాక్టీస్ చేసేవాడు. కొద్దిరోజుల్లో ఓ చానల్‌లో ప్రసారమయ్యే కార్యక్రమానికి వెళ్తానని చెప్పేవాడు.' అని తల్లి జ్యోతి, సోదరుడు గణేష్ తెలిపారు. అయితే ఇంతలోనే ఇలా మరణిస్తాడని అనుకోలేదని వారు వాపోయారు.

ఒత్తిడి తట్టుకోలేక..

- విద్యార్థి ఆత్మహత్య
- శోక సంద్రంలో తల్లిదండ్రులు

పార్వతీపురం టౌన్, మార్చి 20 : ఇంటికి పెద్దకొడుకు.. బాగా చదివి కుటుంబాన్ని ఆదుకుంటాడని ఆ తల్లిదండ్రులు అనుకున్నారు. ఎంతో కష్టపడి కళాశాలలో చేర్పించారు. అయితే ఒత్తిడిని తట్టుకోలేకపోయిన ఆ విద్యార్థి ఉసురు తీసుకున్నాడు. కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కుసుమగుడ్డి వీధికి చెందిన కల్లూరి శంకరరావు, డిల్లీశ్వరి దంపతులు ఒక చిన్న టిఫిన్ హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి ఇద్దరు పిల్లల్ని బాగా చదివించాలనుకున్నారు. ఈ మేరకు పెద్దవాడైన తారకేశ్వరరావు (20)ను ఇంటర్ తర్వాత విజయనగరం జిల్లాలో సెంచూరియన్ యూనివర్సిటీలో చేర్పించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి సీఎస్ఈ కంప్యూటర్స్ (బీటెక్ మొదటి సంవత్సరం) చదువుతున్నాడు. అయితే బీటెక్‌లో చేరిన దగ్గర నుంచి తనకు చదువంటే ఇష్టం లేదని.. చాలా కష్టంగా చదవాల్సి వస్తుందని తారకేశ్వరరావు తల్లిదండ్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఉత్తీర్ణత సాధిస్తానో లేదో అన్న భయంతో మానసిక ఒత్తిడిని తట్టుకోలేక చివరకు బుధవారం తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తారకేశ్వరరావు మరణాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. చేతికందొచ్చిన బిడ్డ ఇలా ఆకస్మాత్తుగా చనిపోతాడని అనుకోలేదని బోరున విలపిస్తున్నారు. దీనిపై ఎస్ఐ పి.సంతోషి కుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తారకేశ్వరరావు (ఫైల్)

బాధ్యతగా పనిచేయాలి

- అధికారులకు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశం

సీతంపేట: ఎన్నికల దృష్ట్యా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎంసీసీ టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వేలైన్స్ టీమ్‌లు బాధ్యతగా పనిచేయాలని పాలకొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమా వళిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీలు, సమావేశాలను వీడియో తీయాలన్నారు. వాటి ఖర్చులకు సంబంధిత అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని సూచించారు. రోజూ అన్ని టీమ్‌లు తమ రిపోర్టును రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

ఎన్నికల నేపథ్యంలో సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు పీవో కల్పనాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులు చేయాలనుకునేవారు ఈ 08941-294040 నెంబర్‌కు ఫోన్ చేయొచ్చని సూచించారు. కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులను పబ్లిక్ యాప్ సీవిజిల్ ద్వారా స్వీకరిస్తామని, వాటిని 100 నిమిషాల్లో పరిష్కరిస్తామని తెలిపారు. 1950 కాల్ సెంటర్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

బొమ్మ తెచ్చిన తంటా!

- ధ్రువపత్రాలన్నింటిపైనా సీఎం చిత్రం
- కోడ్ నేపథ్యంలో సచివాలయాల్లో నిలిచిన సర్టిఫికెట్ల జారీ
- ఆందోళనలో విద్యార్థులు, రైతులు
- నూతన పత్రాలు పంపిణీ చేస్తున్నామంటున్న అధికారులు

(పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) / గరుగుబిల్లి/భామిని)

ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో ధ్రువీకరణ పత్రాల మంజూరుకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. గ్రామ, వార్డు సచివా లయాల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అన్ని ధ్రువపత్రాల్లో సీఎం జగన్ ఫొటో ఉండడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం వాటి జారీని నిలిపేశారు. దీంతో రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాస్తవంగా ఇది పిల్లలను విద్యాలయాల్లో చేర్పించే సీజన్. మరోవైపు నిరుద్యోగులు కూడా పలు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. వారికి పుట్టిన తేదీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎంతో అవసరం. రైతులకు కూడా వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేయాలంటే బ్యాంకులకు వన్‌బీ జతపరిచాల్సి ఉంది. అయితే వన్‌బీతో పాటు ఈ-పాస్, అడంగల్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడి సిబ్బంది వాటిని తీసుకోవడం లేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, సర్టిఫికెట్లు జారీ కావని చెప్పి తిరస్కరిస్తున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, రైతులకు ఏమి చేయాలో తోచడం లేదు. అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఆగాల్సిందేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు, సర్టిఫికెట్ల జారీకి సంబంధం ఏమిటని కొందరు నిలదీస్తుండగా.. ధ్రువపత్రాలపై సీఎం జగన్ చిత్రం ఉండడం వల్ల.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వాటిని జారీ చేయలేమని అధికారులు సమాధానమిస్తున్నారు. దీంతో ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ధ్రువపత్రాలపై నాయకుల చిత్రాలు ఎలా వేస్తారని మండిపడుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా లేదని, వైసీపీ అధికారంలోకి వచ్చాకే ఇటువంటివి చూస్తున్నామని వారు తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై భామిని తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సీఎం జగన్ చిత్రాలు లేని పత్రాలు వచ్చిన తర్వాతే సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. అత్యవసరమైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని, అయితే ప్రస్తుతానికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేమని చెప్పారు.



సీఎం ఫొటో లేకుండా తాజాగా వచ్చిన ధ్రువీకరణ పత్రాలు

భామిని సచివాలయం



తక్కువ స్థాయిలో మంజూరు

సచివాలయాల పరిధిలో కుల, ఆదాయ ధ్రువపత్రాలకు సంబంధించి తక్కువ స్థాయిలో సామగ్రి మంజూరైంది. గతంలో సీఎం జగన్ ఫొటోలతో ఉన్న ధ్రువీకరణ పత్రాల జారీని నిలుపుదల చేశాం. ఎన్నికల నిబంధనల మేరకు సీఎం జగన్, నవరత్నాలు చిత్రాలను తొలగించి నూతనంగా ముద్రించిన పత్రాలను సచివాలయాలకు అందిస్తున్నాం. ప్రతి సచివాలయానికి వంద చొప్పున ధ్రువీకరణ పత్రాలు అందించాం. రైస్ కార్డులు, పింఛన్లతో పాటు పలు పథకాలకు సంబంధించి పత్రాల మంజూరు నిలుపుదల చేశాం. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నాం. ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాల్సిందే. లోగోలు లేని సర్టిఫికెట్లు జారీ చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు. కొన్ని మండలాలకు సామగ్రి తరలించాం. మరికొన్ని మండలాలకు పంపించే చర్యలు చేపడుతున్నాం.

- కె.రామచంద్రరావు, పీడీ, డ్వామా, పార్వతీపురం మన్యం జిల్లా

రశీదు ఉంటేనే రక్షణ

- లేకుంటే ఇబ్బందులు తప్పవు
- రూ.50 వేలకు మించితే పత్రాలు తప్పనిసరి

కొమరాడ: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన వెంటనే కోడ్ అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇది జూన్ 5వ తేదీ వరకు అమల్లో ఉండనుంది. అయితే ఇదే సమయంలో నగదు రవాణాపై నిఘా పెరిగింది. అధికార యంత్రాంగం కోడ్ ఉల్లంఘనులపై దృష్టి సారించింది. డబ్బు, మద్యం, ఇతర వస్తువులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తారన్న ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీస్, రెవెన్యూశాఖల అధికారులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ఈ మేరకు ఎన్నికల నియమావళిపై అందరికీ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది. సరైన ఆధార పత్రాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదు తీసుకువెళ్తే ఎన్నికల అధికారులు జప్తు చేసి కేసు నమోదు చేయనున్నారు. ఆ మొత్తాన్ని కోర్టుకు అప్పగించనున్నారు.

నియమావళి ఏం చెబుతుందంటే..

ఎన్నికల నియమావళి ప్రకారం.. రాజకీయ పార్టీల నాయకులు రూ. 50 వేలకు మించి నగదు, రూ. 10 వేలకు మించిన వస్తువులు రవాణా చేయడం నిషేధం. పార్టీల స్టార్ క్యాంపెయినర్ల వద్ద రూ.లక్షకు మించి నగదు ఉండకూడదు. పౌరులు రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్తే బ్యాంకు నుంచి డబ్బు డ్రా చేసిన రశీదు, లేదా సెల్‌కు వచ్చిన సంక్షిప్త సందేశం చూపించాల్సి ఉంటుంది. డబ్బు ఎవరికి చెల్లించేందుకు తీసుకెళ్తున్నారో తెలిపే ఇన్‌వాయిస్ పత్రం తప్పనిసరి. ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు సంబంధించి వేతనాలు చెల్లింపునకు నగదు తీసుకువెళ్తే వారి జాబితా, డ్రా చేసిన రశీదు వివరాలు ఉండాలి. ఆసుపత్రులకు చెల్లించేందుకు డబ్బు తీసుకెళ్తే.. సంబంధిత నివేదికలు, రోగి వివరాలు ఉండాలి. రైతులు ఏమైనా కొనుగోలుకు నగదు తీసుకెళ్తే.. వ్యాపార సంస్థల నుంచి ఇన్‌వాయిస్ లేదా కొటేషన్స్ తీసుకుంటే మేలు. భూములు, స్థలాలకు సంబంధించిన లావాదేవీలు అయితే దస్తావేజులు మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకున్న స్లాట్ వివరాలు ఉండాలని కొమరాడ తహసీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు.



కొమరాడలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు, రెవెన్యూ శాఖ సిబ్బంది

టీడీపీ అధికారంలోకి వస్తేనే సమస్యలు తీరుతాయి

● బొబ్బిలిలో ప్రచారం ప్రారంభించిన బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) బుధవారం ఎన్నికల ప్రచారాన్ని స్థానిక రాజానగర్ కాలనీ నుంచి ప్రారంభించారు. 8వ వార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. మంచి మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తొలుత తమ ఇంటి ఇలవేల్పు శ్రీవేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు. అనంతరం యుద్ధ స్మారక స్తంభం వద్ద గల శ్రీ సరేపోలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఆయనకు రాజానగర్ కాలనీ వాసులు, అమ్మిగారి కోనేరు గట్టు కాలనీ వాసులంతా ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో చిన్నారులతో పాటు వయోవృద్ధులందరినీ బేబీనాయన ఆప్యాయంగా పలకరించారు. భవన నిర్మాణ కార్మికులు, టిఫిన్ దుకాణాల నిర్వాహకులతో మమేకమై వారి వృత్తి పనిలో తాను కూడా చేయి కలిపి వారిని ఆకట్టుకున్నారు. తొలిరోజు ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని బేబీనాయన అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యలు తీరిపోతాయన్న ఆనందం అందరిలో కనిపించిందని చెప్పారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన నేత పాలూరు బాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, పెద్దింటి మనోజ్ కుమార్, సీనియర్ నేతలు రౌతు రామ్మూర్తి, అల్లాడ భాస్కరరావు, పువ్వల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


బొబ్బిలి ప్రచారంలో బేబీనాయన వెంట పార్టీ శ్రేణులు

ఇదేం దారి?



రాజాం మండలం కంచరాం సమీపంలోని జగనన్న కాలనీకి వెళ్లాలంటే లబ్ధిదారులు నరకయాతన పడుతున్నారు. వర్షం పడితే రోడ్డు చిత్తడవుతోంది. తాజాగా కురుస్తున్న వర్షాలకు మరింత దారుణంగా తయారైంది. తోటపల్లి కాలువ గట్టుపై నుంచి ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు తప్ప మరో మార్గం లేదు. ఆరు నెలలైనా గ్రావెల్ వేయలేదు. దీంతో అడుగు పెట్టాలంటే ఆలోచించాల్సి వస్తోంది. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు అక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించారు. సుమారు 1500 మందికి పట్టాలు ఇవ్వగా ఇంతవరకు 450 మంది లబ్ధిదారులే ఇళ్లు పూర్తిచేశారు. వీరు కూడా నిర్మించకుంటే ఇంటిని రద్దు చేస్తామని అధికారులు బెదిరించడంతో అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నారు. కనీస సౌకర్యాలు లేవని ఇప్పుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-రాజాం

బాబామెట్టలో బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం

విజయనగరం రూరల్: నగరంలోని బాబామెట్టలో బుధవారం ఉదయం 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరుతూ టీడీపీ బ్రాహ్మణ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బాబామెట్టలోని బ్రాహ్మణులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, ఐదేళ్లలో ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నాగరాజు, టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకుడు డాక్టర్ పేరి రామయ్య పంతులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల పేరంటాలకు పూజలు

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామంలో దివ్య బాలపేరంటాలకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా గుడి నిర్మించి ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకులు కరెడ్ల ఈశ్వరరావు హాజరై పేరంటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులంతా ఏకమై అన్నసమారాధన నిర్వహించారు.

31న ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత

కలెక్టరేట్: జిల్లాలోని ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన ధాన్యం చివరికి రావడంతో ఈనెల 31న కొనుగోలు కేంద్రాలను మూసివేస్తున్నట్లు జేసీ కార్తీక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు దీనిని గమనించి తమ వద్ద ఉన్న ధాన్యంను ఈనెల 31 తేదీలో విక్రయించాలని తెలిపారు.

5వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్

లక్కవరపుకోట: మండలంలో జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అయిదో తరగతిలో అడ్మిషన్ పొందేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో తెలిపారు. మార్చి నెలాఖరు వరకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం రూరల్: గొల్లలపేట పంచాయితీ చాకలిపేటలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు కోరారు. బుధవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేసీ కార్తీక్‌కు లేఖ రాశారు. నియోజకవర్గంలో ఎన్నికల నిబంధనలను అధికార పార్టీ నాయకులు తుంగలో తొక్కుతున్నారని, అన్ని గ్రామాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య శిబిరం

విజయనగరం రూరల్: నగర శివార్లలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మూడో రోజు గొట్లాం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఎన్ఎస్ఎస్ పీవో ధర్మారావు, వలంటీర్లు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జామి: మండలంలోని గజపతినగరం నియోజవర్గ పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ రాంబాయ్ బుధవారం పరిశీలించారు. వీటి స్థితిగతులను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకుని పరిశీలించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వంగర: అరసాడలో లక్ష్మీగణపతి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. సాయంత్ర సమయంలో గణనాథుని విగ్రహం ఊరేగింపుతో పాటు, ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు.

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయనగరం క్రైం: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి డీవీ రామ్‌ప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో నగరంలోని వివిధ సంస్థల సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వేసవి దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

బొబ్బిలిలో పోషణ పక్వాడ

బొబ్బిలి: మండలంలోని రాజుపేట, సీతయ్యపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ ప్రభావతి పరిశీలించారు. పోషణ పక్వాడా కార్యక్రమం అమలును పర్యవేక్షించారు. చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణులు, కౌమారబాలికలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ విజయ తదితరులు పాల్గొన్నారు. పాతబొబ్బిలి గ్రామంలో ఒకటో వార్డులో భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీలు ఉమాగౌరి, అరుణ, సుజాత ఆధ్వర్యంలో పోషణ పక్వాడా నిర్వహించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు శశికుమార్


శశికుమార్

విజయనగరం దాసన్నపేట: మహారాష్ట్రలో ఈ నెల 21 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు గరివిడి మండలానికి చెందిన శశికుమార్ ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. శశికుమార్ ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు దొర, కేవీ ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావులు హర్షం వ్యక్తం చేశారు.

కూటమితో రాష్ట్రంలో ప్రభంజనం సృష్టిస్తాం


వంగర: పార్టీలో చేరిన వారితో కోండ్రు

రాజాం, మార్చి 20: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో రాష్ట్రంలోంలో టీడీపీ ప్రభంజనం సృష్టిస్తుందని మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలం దేవుదల గ్రామానికి చెందిన 30 వైసీపీ మద్దతు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కోండ్రు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం రాష్ట్రంలో అఖండ విజయం సాధిస్తుందన్నారు. వైసీపీకి చెందిన కుప్పిలి గణపతి, కె.అన్నాజీ, కె.జగదీష్, కె.నవీన్, కిమిడి రామకృష్ణ, సుంకరి శివ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు తదితరులు ఉన్నారు.

వంగర: శివ్వాంకు చెందిన మాజీ సర్పంచ్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉదయాన మురళీకృష్ణతో పాటు మరో వంద మంది బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శివ్వాంలో పిన్నింటిమోహన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందనే నమ్మకంతో టీడీపీలో చేరినట్లు చెప్పారు. ఓనిలో అప్పలనాయుడుతో పాటు మరో వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి మాజీ మంత్రి కోండ్రు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్.కృష్ణమూర్తి, ధనలక్ష్మి, శ్రీనువాసరావు, రవి, మురళి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మహిళా విభాగం సమావేశం


డ్వాక్రా గ్రూప్ సమావేశంలో టీడీపీ మహిళా విభాగం నేతలు

విజయనగరం రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజుని గెలిపించాలని కోరుతూ టీడీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో గత 10 రోజులుగా నగరంలో మహిళా సంఘాల(డ్వాక్రా సంఘాలు)తో సమావేశం నిర్వహిస్తున్నారు. బుధవారం 8, 28, 29 డివిజన్లలోని సంఘాలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ మహిళా విభాగం నేతలు కంది శమంత కమణి, అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, రౌతు పద్మ, వీరలక్ష్మి, మురిపెన పద్మలత తదితరులు మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి, మహిళల్లో చైతన్యం నింపిన పార్టీ టీడీపీయేనన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు.

మా పార్టీని గెలిపిస్తే ఉచిత విద్య, వైద్యం

● ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


మట్లాడుతున్న కేఏ పాల్

శృంగవరపుకోట, మార్చి 20: వచ్చే ఎన్నికల్లో ప్రజాశాంతిపార్టీని కేవలం వందసీట్లతో గెలిపిస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని ఆ పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ అన్నారు. బుధవారం ఆయన ఎస్.కోటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో సభ ఏర్పాటు చేసి తాను విశాఖ ఎంపీగా పోటీచేస్తున్నానని తెలిపారు. మోదీ, చంద్రబాబు, జగన్‌లను నమ్మొద్దని, వారు మీ తలపై అప్పు తెచ్చి మీకు సంక్షేమ పథకాలు ఇస్తున్న విషయం తెలియకుండా మిమ్మల్ని వెర్రివాళ్లను చేసి ఆడిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ అదానీ చేతికి వెళ్లకుండా కోర్టులో కేసు వేశానని, దీనిపై నేడు కేసు విచారణకు వస్తుందని, ఇందులో పనిచేస్తున్న రెండులక్షల కుటుంబాలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.

పాడుబడ్డ బావులను మూసివేయాలి


తాగునీటి బావిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బొబ్బిలి, మార్చి 20: పట్టణంలో పాడుబడ్డ బావులను, నిరుపయోగంగా ఉన్నవాటిని వెంటనే మూసివేయాలని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. వార్డు పర్యటనలో భాగంగా ఆమె బుధవారం యాతవీధి, బొప్పడాపువీధి, బంగారమ్మకాలనీ, గొల్లవీధి ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి ప్రజావసరాలను పరిశీలించారు. బంగారమ్మకాలనీతో పాటు పలు ప్రాంతాల్లో బహిరంగ స్థలాల్లో పశువులను కడుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నందున వాటిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరుకైన సందుల్లో ఉండే మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శాని టరీ సిబ్బందికి సూచించారు. అనంతరం మున్సిపాలిటీకి ఇటీవల మంజూరైన సెప్టిక్ క్లీన్ వాహనాన్ని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు.

వైభవంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న లలితకుమారి దంపతులు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ శివారు కడకొండ గ్రామంలో బుధవారం గ్రామ దేవత ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వావిలపాడు గ్రామ పెద్ద గోగాడ జగన్నాథం నాయుడు ఆర్థిక సాయంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామ సమీపంలో నిర్వహించిన ఎడ్ల బండ్ల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి.

అభయాంజనేయుని సన్నిధిలో..

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో బుధవారం జరిగిన శ్రీఅభయాంజనేయ స్వామి వార్షికోత్సవాలలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ సంతోషి కుమారి పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. వారితో పాటు మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, మోపాడ చిన్నికృష్ణ తదితరులు ఉన్నారు.

నిబంధనలు అమలు చేయాలి

బాడంగి: ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ పార్టీల ఫోటోలు ఉన్న వాల్ పోస్టర్లు, బ్యానర్లను తొలగిస్తున్నారని, అలాగే పెన్షన్ పుస్తకాలు, పట్టాపాసుబుక్స్, భూమి, సర్వే రాళ్లమీద, ఇళ్లపట్టాల మీద ముఖ్యమంత్రి ఫోటోలు ఉన్నందున వాటన్నింటినీ సేకరించి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచి ఎన్నికల అనంతరం ప్రజలకు అందజేయాలని మీడియా ద్వారా కోరుతున్నట్టు తెలిపారు.

రాజాంలో వైభవ్ జ్యూయలర్స్ షోరూం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

రాజాం రూరల్, మార్చి 20: బంగారం, వెండి, డైమండ్స్ వ్యాపారంలో పేరెన్నికగన్న వైభవ్ జ్యూయలర్స్ రాజాంలో తన 14వ బ్రాంచిని బుధవారం ప్రారంభించింది. చెలికాని జగన్నాథ స్వామి, కొత్తా వెంకటరావు, గ్రంథి అమరేంద్ర, వెంకట్, డాక్టర్ జీసీహెచ్ హనుమంతురావు తదితర ప్రముఖులతో కలిసి సంస్థ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ గ్రంథి మల్లికా మనోజ్ జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారుల నమ్మకమే పునాదిగా బంగారు, వెండి, వజ్రాభరణాల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నామని, లాభార్జన కోసమే కాకుండా పది మంది మంచిని కోరే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఏ ప్రాంతంలో షోరూం ఏర్పాటు చేస్తే అక్కడివారికే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గొంట్ల రాఖాల్, సింధూరి వెంకటేష్, గ్రంథి సాయికీర్తన, పైడా ప్రసాద్, కంకటాల మల్లిఖార్జునరావు తది తరులు పాల్గొన్నారు. 'మన రాజాం గురించి తెలుసుకుందాం' కాంటెస్ట్‌లో గెలు పొందిన పదిమంది విజేతలకు 22 క్యారెట్ల ఒక గ్రాము బంగారు కాయిన్‌ను అందజేశారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం


ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో బుధవారం సీతారామాలయ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం యజ్ఞయాగాదులతో పాటు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటల నుంచి బయటో భజన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి స్వామి వారి కల్యాణం, ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. సోంపురం, గుడివాడ, జగ్గయ్యపేట గ్రామాలకు చెందిన వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఏర్పాటు చేసిన ఎడ్ల బండ్ల పరుగు పోటీలు చూపరులను ఎంతగానో అలరించాయి.

ఆలయానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న రాంప్రసాద్

లక్కవరపుకోట (కొత్తవలస), మార్చి 20: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ శివారు గ్రామం సాంబయ్యపాలెంలో బుధవారం మరిడిమాంబ ఆలయానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్ శంకుస్థాపన చేశారు. గ్రామంలో గ్రామదేవత ఆలయం నిర్మాణానికి గ్రామస్థులంతా ఏకమై ఉన్నారని రాంప్రసాద్ తెలిపారు. నిర్మాణానికి సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జునరావు, కోళ్ల శ్రీను, రమణమూర్తి, రత్నాజీ, అయ్యరక సంఘ రాష్ట్ర కన్వీనర్ బంగారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో చెత్తను తొలగించేలా చర్యలు


మాధవ బజార్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

రాజాం, మార్చి 20: పురపాలక సంఘ పరిధిలోని మాధవ బజార్‌లో ఉన్న మురిగి కాలువాల్లో ఉన్న చెత్తను తొలగించడానికి కమీషనర్ జె రామప్పల నాయుడు బుధవారం చర్యలు తీసుకున్నారు. మాధవ బజార్‌లో వ్యాపారులు లంతా కాలువాల్లో చెత్త ఎక్కువగా ఉండటవలన వర్షం నీరు రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు లేకుండా ఇబ్బందులు పడుతున్నామని పిర్యాదు చేయడంతో ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించి కాలువాల్లో చెత్తను తొలగించడానికి చర్యలు తీసుకున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షం కాఋనంగా డోలపేటకు వెళ్లే లైన్‌లో వర్షపు నీటిని జేసీబీతో తొలగించడానికి చర్యలు చేపట్టారు. కొత్తవలస గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆ గ్రామంలో ఉన్న వివిధ పార్టీ నాయకుల ఫొటోలను తొలగించేలా చర్యలు చేపట్టారు. అనంతరం వార్డు సచివాలయాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో ఏ నాయకుల వాల్ పోస్టర్లు ఉంచకూడదని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈయనతో పాటు ఏఈ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో పోలీస్ ఫ్లాగ్ మార్చ్



బొబ్బిలి, బాడంగిలో కవాతు చేస్తున్న పోలీసులు

బొబ్బిలి, మార్చి 20: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటు వంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉండేందుకు పోలీసు యంత్రాం గం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం సీఐ మలిరెడ్డి నాగేశ్వర రావు, ఎస్ఐ జి.లోవరాజు ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు (ఆర్‌పీఎస్ఎఫ్), సివిల్ పోలీసులు సంయుక్తంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో మిలటరీ కాలనీ, రాజ్‌మహల్‌కాలనీ ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తులను అణచి వేస్తామని హెచ్చరించారు. అలాంటి వ్యక్తుల సమాచారం ఏదైనా ఉంటే నిర్భయంగా తమకు తెలియజేయవచ్చని సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

బాడంగి: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ జయంతి కోరారు. మండలంలోని కోటిపల్లి, ముగడ గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీసులతోపాటు ఆర్‌పీఎస్ఎఫ్ పోలీసులు 31 మందితో గ్రామాల పురవీధుల్లో కవాతుచేశారు. విస్తృతంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో వివాదాలు, తగువులు సృష్టించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

మహిళను మోసం చేసిన కేసులో జైలు

రామభద్రపురం, మార్చి 20: మహిళను మోసం చేసిన కేసులో మండలానికి చెందిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధించారు. దీనికి సంబంధించి ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రొంపల్లి గ్రామానికి చెందిన మొదిలి కృష్ణ ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని చెప్పి కొన్ని సంవత్సరాలుగా మాయమాటలతో లోబర్చుకున్నాడు. అంతేకాకుండా మహిళను గర్భవతిని చేశాడు. వెంటనే పెళ్లి చేసుకోమని యువతి అడగడంతో కృష్ణ నిరాకరించాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు 2017లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన అప్పటి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీనిపై కోర్టులో వాదోపవాదనలు ప్రారంభమయ్యాయి. బాధితుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. దీనిపై బుధవారం విజయనగరం మహిళా సెషన్స్ కోర్టు న్యాయాధికారి పద్మావతి తీర్పును వెల్లడిస్తూ నిందితుడికి 11 సంవత్సరాలు జైలు శిక్ష, 5 వేల రూపాయల జరిమానా విధించారు.

పిడుగు పడి గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

తెర్లాం: పిడుగుపడి సుమారు 35 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసు కుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వి.చిన్నయ్యపేటలో బుధవారం కురిసిన అకాల వర్షాలకు పిడుగు పడి వెన్నెల కృష్ణ అనే రైతుకు చెందిన సుమారు 35 గొర్రెలు మరణించాయి. రోజూలాగే బుధవారం కూడా మేతకు గొర్రెలను తీసుకువెళ్లా మని, గొర్రె పిల్లలను ఓ చోట ఉంచామని, ఇంతలోనే వర్షం మొదలైవడంతో పిడుగుపడిందన్నారు. ఆ ధాటికి గొర్రెలు మృతి చెందాయని వాపోయాడు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

క్షయ వ్యాధిపై అవగాహన


టీబీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రామభద్రపురం, మార్చి 20: మండల కేంద్రంలో బుధవారం క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పులి దిలీప్‌కుమార్ నేతృత్వంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. 2 వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలో ఉన్న పీహెచ్‌సీలో కఫం పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఆరు నెలలపాటు సక్రమంగా మందులు వాడినట్లైతే ఈ క్షయ వ్యాధిని నిరోధించవచ్చునన్నారు. పెద్దవాళ్లలో బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా ఈ క్షయవ్యాధి బారినపడకుండా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ టీబీ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ నడిమింటి వాసుదేవరావు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు బహుమతులు


ఉద్యోగులకు బహుమతులు అందిస్తున్న డిపో మేనేజర్

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న నలుగురు ఉద్యోగులకు బుధవారం డీఎం కె.రమేష్ ప్రోత్సాహక బహుమతులు అందించారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ డిపో నుంచి పుణ్యగిరి శ్రీఉమాకోటి లింగేశ్వర స్వామి, సన్యాసేశ్వరస్వామి ఆలయాలకు ప్రత్యేక బస్సులు నడిపిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ప్రతిభ కనబరిచిన కండక్టర్లు పి.శ్రీనివాసరావు, రాజేశ్వరి, డ్రైవర్లు ఆతవ శ్రీనివాసరావు, పి.గోపాలరావులకు బహుమతులు అందించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ డిపో కార్యదర్శి కె.కోటేశ్వరరావు ఈ బహుమతులను సమకూర్చారు.

జాతర వెలవెల

● వర్షంతో కళ తగ్గిన రాజాం పోలిపల్లి ఉత్సవం


బురదమయమైన జాతర ప్రాంతం

రాజాం రూరల్, మార్చి 20: అమ్మవారి జాతర ప్రాంతం వెలవెలబోయింది. వందలాది మందితో బుధవారం సైతం జాతర ప్రాంగణం, అమ్మవారి ఆలయం కిటకిటలాడాల్సి ఉండగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు సందడి తగ్గింది. ఆశించిన స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రాకపోవడంతో ఆ ప్రభావం హుండీలపై పడే అవకాశాలు లేకపోలేదని దేవస్థానం ఈవో మాధవరావు స్పష్టం చేశారు. జెయింట్‌వీల్స్, కొలంబస్‌లు, మేజిక్‌చైర్లతో పాటు చిన్నారులను అలరించే ఎన్నో వినోద సాధనాలు నిలిచిపోయాయి. జాతర ప్రాంతం అంతా బురదగా మారడం, భారీగా వర్షం కురవడంతో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందుజాగ్రత్త చర్యగా ఆయా వినోద సాధనాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

● జాతర ప్రాంగణంలో మంగళశారం అర్ధరాత్రి దాటాక బాణసంచా దద్దరిల్లింది. అర్ధరాత్రి 12.18 గంటలకు నిర్వహించిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఘటోత్సవ కార్యక్రమం జరుగుతున్న క్షణాల్లోనే భారీగా బాణసంచా కాల్చడం ప్రారంభించారు. దీంతో వందలాది మంది భక్తులు ఆలయ సమీపంలోని పొలాల్లోకి చేరుకున్నారు. వివిధ రకాల బాణసంచా కాల్చడాన్ని తిలకించారు. ప్రాంతమంతా బాంబుల ధ్వనితో దద్దరిల్లింది. మిరుమిట్లు గొలిపే వెలుగులు విరజిమ్మాయి. ఏటా జాతరలో బిక్కవోలుకు చెందిన ఓ ప్రయివేటు కంపెనీకి చెందిన వ్యక్తులు తయారు చేసి తెచ్చిన బాణసంచా కాల్చడం ఆనవాయితీగా వస్తున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి కూడా బాణసంచా కాల్చారు. ఈ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాజాం టౌన్, రూరల్ సి.ఐ.లు మోహనరావు, శ్రీనివాస్‌రాజాం, రేగిడి ఎస్.ఐ.లు రవికిరణ్, శ్రీనివాసరావు సిబ్బందితో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రశాంతంగా జాతర నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన అన్నిశాఖల అధికారులకు, జాతరకు హాజరయ్యే వారికి, ప్రముఖులకు ఎస్.వి.ఆర్. కళాపరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్ కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో 800 కుటుంబాల చేరిక

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి/ సీతానగరం: సీతానగరంలో బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు బేబీనాయన, బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని కిషోర్ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 800 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. సీతానగరం జడ్పీటీసీ మాజీ సభ్యుడు టెంటు వెంకటప్పలనాయుడు, మాజీ ఎంపీపీ బి.శ్రీరాములు, పెదబోగిలి వైస్ సర్పంచ్ కె.అరవింద్‌తో పాటు కాశీపేట, గాదెలవలస, చిలంకలం, బూర్జ, పెదబొగిలి, తణుకుపేట, కృష్ణరాయపురం తదితర గ్రామా ల్లోని వైసీపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీ నాయకులు కండువాలువేసి ఆహ్వానించారు. ఈసందరంగా బేబీనాయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయ్‌చంద్ర విజయం కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పని చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ జగదీష్ మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గం అభివృ ద్ధి టీడీపీకాలంలోనే జరిగిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాలూరు బాబు మాట్లాడుతూ విజయచంద్ర విజయం కోసం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేణు, గొట్టాపు వెంకటనాయుడు, బోనుదేవి చంద్రమౌళి, బార్నాల సీతారాం, బొమ్మినాయిని లక్ష్మణరావు, బోరాడ చిరంజీవి, నాగ భూషణరావు పాల్గొ న్నారు. కాగా పెదబోగిలలో ఉప సర్పంచ్ అరవింద్ పార్వతీపురం, బొబ్బిలి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు విజయచంద్ర, బేబీనాయన, మాజీ ఎమ్మెల్సీ జగదీష్‌లను గజమాలతో సత్కరించారు.


సీతానగరంలో మాజీ ఎంపీపీ బొన్నాడ శ్రీరాములును ఆహ్వానిస్తున్న విజయచంద్ర, బేబీనాయన, జగదీష్

వైసీపీని ఇంటికి పంపించాలి

- సూపర్‌సిక్స్ పథకాలతోనే అన్నివర్గాలకు న్యాయం
- తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు


కురుపాం: కార్యాలయం ప్రారంభిస్తున్న విజయరామరాజు, జగదీశ్వరి, వీరేష్ చంద్రదేవ్

రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఇంటికి పంపించాలని తెలుగు దేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. వైసీపీ హయాంలో అన్నివర్గాలు అణచివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. టీడీపీ అధినేత చంద్ర బాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతోనేఅన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. బుధవారం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల భారీగా టీడీపీలో పలువురు చేరారు. అలాగే బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు.

జగన్నాథపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: పార్వతీపురం పురపాలక సంఘంలోని జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుక గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి అభ్యర్థి విజయచంద్ర మాట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వెసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మరడాంలో 60 కుటుంబాలు..

దత్తిరాజేరు: మరడాంలో వైసీపీ నుంచి మాజీ సర్పంచ్ కర్రి పైడమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి అప్పలనాయుడు, సూరబత్తుల సూర్యనారాయణ, కర్రి ఆదినారాయణ, గొరుసు రామారావు, గుగ్గిలపు శ్రీనివాసరావు, గంట చిన్నారావు, ఆవాల సురేష్, కర్రి రాము, గొరుసు మహేష్, తాడి వెంకటసాయిలతోపాటు 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. తొలుత పెదమానాపురంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. తాడెందొరవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి పడాల అరుణ, టీడీపీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, జనసేన మండలాధ్యక్షుడు చప్ప అప్పారావు, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బెజవాడ బంగారునాయుడు, మజ్జి మహేష్, మండల మహిళా అధ్యక్షురాలు గేదెల మంగమ్మ, గంట వెంకటలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఎగరడం ఖాయం: సంధ్యారాణి

సాలూరు రూరల్: సాలూరు, రాష్ట్రంలోనూ టీడీపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ సాలూరు నియోజకవర్గ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.మండలంలోని అన్నంరాజువలసపంచాయతీలో లోవవలస, పసుపువానివలస, అంటివలస, రెయ్యివానివలస తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీకార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆముదాల పరమేశు, భాస్కరరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

జగదీశ్వరి గెలుపునకు కృషి చేయాలి: శత్రుచర్ల..

కురుపాం: కురుపాం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు పిలుపునిచ్చారు. కురుపాంలోని రావాడ రోడ్డులో జగదీశ్వరి,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం విజయరామరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కురుపాం మండలంలోని కిచ్చాడ గ్రామానికి చెందిన 25 కుటుంబాలు, గుమ్మలక్ష్మీపురం మండలంలోని కానసింగి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ కూటమిలో చేరాయి. అనంతరం టీడీపీ కార్యాలయం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు దూళికేశ్వరస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన సమన్వయకర్త కద్రక మలేష్ పాల్గొన్నారు.

అపోహలు విడనాడాలి: శ్రీనివాస్

గజపతినగరం: పార్టీ గెలుపునకు కృషిచేయాలని గజపతినగరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.గజపతినగరంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ విజయానికి నాయకుల, కార్యకర్తలు అపోహలు విడనాడి ప్రతిఒక్కరు ఏకతాటిపై నడవాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయా లన్నారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండడంతో విభేదాలు విడనాడా లని పిలుపునిచ్చారు. వైసీపీకి ఒక్కచాన్స్ ఇచ్చి ప్రజలు చాలా బాధపడుతు న్నారని, మరో అవకాశం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. కార్యక్ర మంలో టీడీపీ మండలాధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులు డాకి నారాయణప్పల నాయుడు, ప్రదీప్‌కుమార్, జి.గోవింద, మిత్తిరెడ్డి వెంకట రమణ పాల్గొన్నారు.

24 నుంచి ప్రచారంలో పాల్గొనాలని తీర్మానం

నెల్లిమర్ల: పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గ అభ్యర్థిగా ఎంపిక చేసిన జనసేన నాయకురాలు లోకం మాధవికి సంపూర్ణమద్దతు ప్రకటించి ఈనెల 24 నుంచి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాలని టీడీపీ నాయకులు తీర్మానించారు. బుధవారం నెల్లిమర్లలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజును ఆహ్వానించి ఆయన సమక్షంలో మాధవికి అన్ని గ్రామాల నాయకులను పరిచయం చేసి ప్రచార కార్యక్రమాలకు సన్నద్ధం కావాలని సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు.


సాలూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సంధ్యారాణి

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ: పట్టణంలోని వెంకమ్మపేటలోని ఎంపీయూపీ స్కూల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఎల్‌పీజీ గ్యాస్ వినియోగం, అగ్ని ప్రమాదాల జరిగే సమయంలో తీసుకోవాల్సిన జా గ్రలు, పాటించాల్సిన నియమాలరు వివరించారు. అనంతరం విద్యార్థులతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.పరాంకుశంనాయుడు, ఎస్.గోపి, ఉదయ్‌బాబు, నాగమణి, జి.లక్ష్మీకుమారి, అగ్నిమాపక సిబ్బంది రవి, ఎం.భగవాన్‌రావు, కె.సత్యనారాయణ, జి.సురేష్, బి.హరిప్రసాద్, జి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్లగా నమోదు చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం:గిరిజనప్రాంతాల్లో ఓటింగ్‌శాతంపెంచడానికి, ఓటు విలువపై అవగాహన కల్పిస్తున్నామని జిల్లా రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పి.కొండలరావు, రెడ్‌క్రాస్ సభ్యులు గుడ్ల హరి ప్రసాద్, బేతా కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరుగా నమోదుకు ఏప్రిల్ 15 వరకు సమయం ఉందని తెలిపారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి: పంచాయతీల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, రావుపల్లి పంచాయతీల్లో పారిశుధ్యపనులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రహదారులపై వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు. మురుగు నిల్వలను ఎప్పటికప్పుడు వేరే ప్రాంతానికిక తరలించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సాయికుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎంపీడీవో


గొట్టివలసలో స్టిక్కర్లను తొలగిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పైల సూర్యనారాయణ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధుల పోస్టర్లు, బ్యానర్లు, స్టిక్కర్లు ఉంటే విధిగా తొలగించాలన్నారు. విగ్రహాలు, శిలాఫలకాలకు ముసుగులు వేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకూడదన్నారు. కాగాసంతోషపురం పంచాయతీ పిట్టలమెట్ట రహదారికి ఆనుకుని శిలాఫలకంపై ముసుగులు వేశారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో అక్కడలా.. ఇక్కడిలా..! శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో స్పందించారు.

సంతకాలకే పరిమితమైన సమావేశం

గరుగుబిల్లి: గరుగుబిల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సంతకాలకే పరిమితమైంది. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ బత్తుల లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికలనిబంధనల మేరకు సమస్యలు ప్రస్తావించకూడదన్నారు. పంచాయతీరాజ్ చట్టం నిబంధనల మేరకు మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉందని తెలిపారు. పంచాయతీల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా అమలుచేయాలని చెప్పారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని పలుశాఖల అధికారులు హాజరుకాలేదు. పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆశతో వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు నిరాశే మిగిలింది. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వైస్ ఎంపీపీ ఎన్.లక్ష్మి, టీడీపీ ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, సర్పంచ్‌లు కె.రవీంద్ర, బి.వెంకటనాయుడు, బి.మహేశ్వరరావుతో పాటు ఎంఈవో ఎస్.నాగభూషణరావు, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'శతశాతం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు'

పార్వతీపురం ఆంధ్రజ్యోతి:గరుగుబిల్లి మండలంలోని సంతోషపురం వద్ద శిలాఫలకం మోడల్ కోడల్ ఆఫ్ కాండాక్ట్ అమల్లోకి రాకముందే ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఉన్న ఎన్నికల నిబంధన ప్రకారం ఆటువంటి శిలాఫలకాలపై ప్రజాప్రతినిధుల ఫొటోలు పేర్లు తొలగించిన అవసరంలేదని కురపాం నియోజకవర్గ రిటర్నింగ్‌అధికారి రమణ ఒకప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో అక్కడలా.. ఇక్కడిలా శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ మోడల్‌కోడ్ ఆఫ్ కాండక్ట్ నూటికి నూరుశాతం అమలు చేస్తున్నామని చెప్పారు.తోటపల్లి ప్రాజెక్టు వద్ద పేర్లు కప్పుతూ వేసిన సున్నాన్ని తొలగించామని తెలిపారు. కాగా టీడీపీ హయాం లో ఏర్పాటు చేసిన బోర్డులపై సున్నాలు వేయడంపై పలువురు విమర్శిస్తున్నారు.

కోటదుర్గ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠ

మక్కువ:మక్కువలో శ్రీకోటదుర్గ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పండితులు మొక్కరాల వెంకటరమణమూర్తి, ఆరవల్లి విజయ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుమారు మూడు వేల మందికి అన్న ప్రసాద వితరణ చేశారు.

రేపటి నుంచి సీతారామ మందిర ప్రతిష్ఠోత్సవాలు

గరుగుబిల్లి: రావుపల్లిలో శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు సీతారామ మందిర పునర్నిర్మాణ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మూడురోజుల పాటు నిర్వహించే పూజల్లో 11 మంది రుత్వికులు పాల్గొంటున్నారని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయం ప్రారంభం

సాలూరు రూరల్:సాలూరు మెంటాడవీధి సమీపంలో కొత్తమ్మతల్లి ఆలయ ప్రారంభించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రాణప్రతిష్ఠపూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి.సాలూరు వేగవతి వంతెన వద్ద జాతీయరహదారి పక్కన ఉన్న ముత్యాలమ్మఅమ్మవారి ఆలయ పునఃప్రారంభించారు.అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. కొత్తమ్మతల్లి,ముత్యాలమ్మలను వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అమ్మవార్లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీభంజ్‌దేవ్,మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, జరజాపు సూరిబాబు,గిరి రఘు తదితరులు దర్శించుకొని పూజలు చేశారు.

దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

జియ్యమ్మవలస: చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ ఓరల్ డే సందర్భంగా దంత వైద్యురాలు రమ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నోటి ఆరోగ్యం చాలా అవసరమన్నారు. దంతాల చిగుళ్ల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే క్యాన్సర్ వంటి రోగాలకు గురయ్యే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ టీకే సునీల్ కుమార్, డాక్టర్ అనిల్ చైతన్య, కె.చంద్రవర్మ, హెడ్ నర్సు కె.పార్వతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో మహిళల చేరిక


బీజేపీలో చేరిన మహిళలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నాయకులు

ఒడిశా

రాయగడ:స్థానిక సెరిగుడలోని బీజేపీకార్యాలయంలో ఆపార్టీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బురిడి లక్ష్మి సమక్షంలో 59 మంది మహిళలు పార్టీలో బుధవారం చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

సభకు అనుమతి ఇవ్వకపోవడం సరికాదు

- టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర

సీతానగరం:సీతానగరంలో తాము సభను ఏర్పాటు చేసుకుంటామని ముందుగా అనుమతి కోరినా పార్వతీపురం రిటర్నింగ్‌అధికారి అనుమతులు మంజూరుఇవ్వకపోవడం సరికాదని టీడీపీ, బీజేపీ, జనసేనకూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర ఒకప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులు కావాలంటే 48 గంటల్లోపు దర ఖాస్తు చేసుకోవాలని చివరినిమిషంలో తమకు తెలియజేయడం దారుణమని పేర్కొన్నారు. ఎన్నికలకోడ్ నిబంధన ప్రకారం దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. చివరినిమిషంలో నిరాకరించడం తగదని పేర్కొన్నారుర.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు పక్షపాతం లేకుండా వ్యవహరించాలని కోరారు.

విద్యార్థినులకు మలేరియా పరీక్షలు


విద్యార్థినులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న 277 మంది విద్యార్థినులకు బుధవారం పాఠశాలలో మలేరియా పరీక్షలు నిర్వహించినట్లు దోను బాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భాను ప్రతాప్ తెలిపారు. ఈ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినికి మలేరియా పరీక్షల్లో పాజిటివ్ నిర్ధారణ అయిందని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులందరికీ మలేరియా, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేసినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ సరుకులపై కోడ్ ఎఫెక్ట్

- లోగోలు కనిపించకుండా స్టిక్కర్లు అంటిస్తున్న సిబ్బంది


సీతంపేట సివిల్ సప్లై గోదాములో సరుకుల లోగోలపై స్టిక్కర్లు అంటిస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలు, బాలింతలు, గర్భిణులకు అందించే సరుకులపై ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ పడింది. పామాయిల్, పోర్టిఫైడ్ రైస్‌తోపాటు పలు సరుకులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లోగోలతో పంపిణీచే స్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వం లోగోతో ఉన్న అక్షరాలు కనిపించకుండా సివిల్ సప్లై అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి ప్యాకెట్ మీద స్టిక్కర్లు అంటించి అవి కనిపించకుండా జా గ్రత్తలు తీసుకోవాలని సివిల్ సప్లై గోదాములకు సిక్కర్లను అధికారులు అందజేశారు. దీంతో ప్యాకెట్లపై స్టిక్కర్లను అంటించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

సీతంపేటలో లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం


లక్ష్మీగణపతికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీతంపేట: సీతంపేటలోని లక్ష్మీ గణపతిఆలయం 45 వారికోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడు కళ్యాణం జరిపించారు. కార్య క్రమంలో జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ, నరసింహులు, ఆలయ అర్చకులు వేమకోటి సాయికృష్ణ, వేమకోటి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం టౌన్:పార్వతీపురంలోని 250 ఏళ్ల చరిత్ర కలిగిన సీతారామ స్వామి ఆలయ ప్రాంగణంలో పట్టణ గ్రూపుదేవాలయాల ఈవో ప్రసాదు ఆధ్వర్యంలోధ్వజస్తంభాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. ఆంజనేయ ఉపాసకులు బ్రహ్మశ్రీ శ్రీనివాసశర్మతోపాటురుత్వికుల వేదమంత్రోశ్చరణలమధ్య ధ్వజస్తంభ ప్ర తిష్ఠాపన జరిగింది. ధ్వజస్తంభ దాతలు మజ్జి రామం బ్రదర్స్‌తోపాటు కల్యాణ మండప నిర్మా ణకర్త గౌరీశంకరబాల కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్య క్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బి. జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

సాలూరు రూరల్: క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని టీబీ సూపర్‌వైజర్ నరేష్ పిలుపునిచ్చారు. బుధవారం శివరాంపురంలో ఉపాధి హామీ పథకం కూలీలకు క్షయవ్యాధి అవగాహన వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సన్యాసమ్మ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో సమస్యలు నమోదు చేయాలి

భామిని: కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన మండలం (ఏబీపీ)గా గుర్తించడంతో అన్నిశాఖల సమస్యలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు.బుధవారంభామినిలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 500 మండలాలు వెనుకబడినవిగా గుర్తించగా, మూడు నెలల కిందట భామిని మండలం 58వ ర్యాంకుగా ఉండేదని, ప్రస్తుతం 488 ర్యాంక్‌కు పడిపోయిందని తెలిపారు.

కిచ్చాడలో ఫ్లాగ్‌మార్చ్


కిచ్చాడలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కురుపాంరూరల్:రానున్నఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా పాల్గొనే విధంగా కురుపాం ఎస్ఐ షన్ముఖరావు ఆధ్వర్యంలో బుధవారం కిచ్చాడలో అవగాహన కల్పించారు.ఈ మేరకు కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

పాఠశాలల తనిఖీ

గుమ్మలక్ష్మీపురం:కొత్తగూడ,గుమ్మలక్ష్మీపురం బాలికల ఆశ్రమ,తిక్కబై ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాంగదయ్య బుధవారం తనిఖీచేశారు. ఆయన వెంట ఏటీడబ్ల్యువో సురేష్‌కుమార్ ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న రుక్మాంగదయ్య

స్వేచ్ఛగా ఓటు వేయాలి

సాలూరు రూరల్: కొఠియా గ్రూప్ గ్రామాల ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరాపుట్ జిల్లా ఏడీఎం హిమాంశు శతపథి, పొట్టంగి బీడీవో సుకాంత్ కుమార్ పట్నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం సాలూరు మండలంలోని కొఠియాగ్రూప్‌లోని ఎగువశెంబి,ధూళిభద్ర, దొరలతాడివలస, మూలతాడివలసలో రాపుట్ జిల్లా స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటర్ చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు.ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఓటర్ అవగాహన ర్యాలీలు చేశారు. కార్యక్రమంలో పొట్టంగి తహసీల్దార్ బీరేంద్ర బహదూర్‌సింగ్ దరువా పాల్గొన్నారు.


ధూళిభద్రలో ర్యాలీ చేస్తున్న అధికారులు,గిరిజనులు